తలసేమియా వ్యాధితో తల్లడిల్లుతోంది

- ప్రాణభిక్ష పెట్టాలని కుటుంబసభ్యుల వేడుకోలు



స్రవంతి

రామకుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదేళ్ళు కూడా నిండని ఈ చిన్నారి తలసేమియా వ్యాధి బారిన పడింది. పేదరికంలో మగ్గుతున్న కుటుంబసభ్యులు ఆ చిన్నారికి వైద్యం అందించేందుకు సాయం చేయాలని సర్కారును కోరుతున్నారు. రామకుప్పం మండలం బందార్లపల్లె పంచాయతీ గడ్డూరుకు చెందిన అమరనాథ్ దంపతుల పెద్ద కుమార్తె స్రవంతి(9) పుట్టిన ఎనిమిది నెలలకు అస్వస్థతకు గురైంది.వైద్యపరీక్షలు చేయించగా తలసేమియా వ్యాధి బయటపడింది.అప్పట్నుంచీ నెలలో మూడు రోజులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో స్రవంతికి రక్తం ఎక్కించాల్సివస్తోంది. ఏళ్ళు గడిచినా పాప ఆరోగ్యంలో ఎటువంటి మార్పు లేదు. ఈ విషయమై వైద్యులను సంప్రదిస్తే పాపకు పదేళ్ళు దాటక ముందే ఆపరేషన్ చేయాలని, దానికి రూ.20లక్షలు ఖర్చువుతుందని చెప్పారు. అమరనాథ్ ఉన్న కొద్దిపాటి భూమిలో బోరెండిపోవడంతో పంటల సాగుకు స్వస్తి చెప్పాడు.అప్పటి నుంచి వెదురుతో తట్టలు, బుట్టలు అల్లుతూ జీవనం గడుపుతున్నారు.స్రవంతికి రూ.లక్షలు వెచ్చించి,ఆపరేషన్ చేయించే స్తోమత లేక, ఎటూ పాలుపోని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం స్పందించి పాపకు వైద్యసాయం అందించి, ప్రాణభిక్ష పెట్టాలని కోరుతున్నారు.



మీ పార్టీ అధ్యక్షుడు చురుగ్గా ఉంటున్నారా?

- నాయకుల పనితీరుపై టీడీపీ సర్వే ప్రారంభం
- నామినేటెడ్ పదవుల ప్రకటన కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పార్టీ నాయకుల పనితీరుపై తెలుగుదేశం సర్వే ప్రారంభించింది. 'మీ మండల లేదా టౌన్ పార్టీ అధ్యక్షుడు లేదా క్లస్టర్ ఇన్‌చార్జి (వారి పేర్లతో సహా) పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరికీ అందుబాటులో ఉంటున్నారా? ఈ ప్రశ్నకు అవునంటే ఒకటి నొక్కండి, కాదంటే 2 నొక్కండి' అన్న వాయిస్ మెసేజ్ కుప్పం నియోజకవర్గంలోని కార్యకర్తల మొబైళ్లకు రావడం బుధవారం నుంచి ప్రారంభమైంది.ఇప్పుడు నామినేటెడ్ పదవుల జాతర నడుస్తోంది.కుప్పం నియోజకవర్గంలో ఇప్పటికే కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయ కమిటీని అనధికారికంగా ప్రకటించేశారు. చైర్మన్ పదవిని చాలామంది ఆశించినా, చివరకు బీఎంకే.రవిచంద్రబాబునే వరించింది. ఆయనతో పాటు 10 మంది డైరెక్టర్ల పేర్ల జాబితా కూడా సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనికి సంబంధించిన జీవో రెండుమూడు రోజుల్లో వెలువడనుంది. గతంలో కూడా ఇదే ఆలయ చైర్మన్‌గా బీఎంకే పనిచేసి వుండడం విశేషం. ఇంకా రెస్కో, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీల భర్తీ జరగలేదు. దీనితోపాటు ఆలయాలు, సింగిల్ విండోలు వంటి ఎన్నో ఉన్నాయి. ఆయా కమిటీల చైర్మన్, డైరెక్టర్ల పదవులకోసం ఎందరో క్యూలో ఉన్నారు తమ ప్రయత్నాలు తాము ఇప్పటికే చేస్తున్నారు. మరోవైపు ఖాళీగా ఉన్న కుప్పం మున్సిపల్ చైర్మన్‌గిరీ కూడా టీడీపీ నాయకులను ఊరిస్తోంది. కౌన్సిలర్ల ఎన్నిక ద్వారా భర్తీ అయ్యేదే అయినా చైర్మన్ గిరీకోసం పోటీ అధికంగా ఉంది. అయితే ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, టీడీపీ అధిష్ఠానంనుంచి ఎవరికీ హామీ ఇంతదాకా లభించలేదు. అసలు అధిష్ఠానం మనసులో ఏముందో కూడా తెలియకుండా పోయింది. స్వయంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ నియోజకవర్గ పార్టీ వ్యవహారాలు చూస్తున్నా, తన చేతుల్లో కూడా ఏమీ లేదని అంతా పెద్దాయన చంద్రబాబు చూసుకుంటున్నారంటూ చేతులెత్తేశారు. అయితే నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందుబాటులో ఉంటున్న వారికే పదవులు లభిస్తాయని, తన చుట్టూ తిరిగే ఏమీ లాభం లేదని నియోజకవర్గ పర్యటనకు వచ్చినపుడల్లా పార్టీ అధినేత చంద్రబాబు శ్రేణులకు స్పష్టం చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు అందుకు తగ్గట్టుగానే వాయిస్ మెసేజ్ టీడీపీ కార్యకర్తల మొబైళ్లకు రావడం ప్రారంభమైంది. ఈ మెసేజ్‌లు నియోజకవర్గంలో చర్చనీయాంశమయ్యాయి. నిజంగా పార్టీకోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఉండగా, కేవలం పనిచేస్తున్నామన్న ప్రచారం ద్వారా పదవులు కొట్టేయాలనుకున్న నాయకుల్లో మాత్రం ఈ వాయిస్ మెసేజ్‌లు గుబులు రేపుతున్నాయి. పదవుల పందేరంలో తాము ఏ స్థానంలో ఉంటామో తెల్చుకోలేక పార్టీ నాయకులు, కార్యకర్తలు నామినేటెడ్ పదవుల ప్రకటనకోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

నేటినుంచి టెన్త్ మూల్యాంకనం



చిత్తూరు పీసీఆర్ హైస్కూల్లో మూల్యాంకన ఏర్పాట్లు

- ముగియనున్న ఇంటర్ స్పాట్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): టెన్త్ జవాబు పత్రాల మూల్యాంకనానికి విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. గత నెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు చేపట్టే జవాబు పత్రాల మూల్యాంకనానికి స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల నిఘాలో స్పాట్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. క్యాంపు అధికారిగా, డీఈవో వరలక్ష్మి వ్యవహరించనున్నారు. డిప్యూటీ క్యాంపు (స్ట్రాంగ్‌రూం) అధికారిగా ఏడీ, పరీక్షల సహాయ కమిషనర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ క్యాంపు (అడ్మినిస్ట్రేషన్) అధికారిగా పుత్తూరు డీవైఈవో ప్రభాకర్ రాజు వ్యవహరించనున్నారు. క్యాంపు నిర్వహణలో 130 మందిని చీఫ్ ఎగ్జామినర్లుగా, 744 మందిని అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా, 370 మందిని స్పెషల్ అసిస్టెంట్లుగా నియమించారు. డ్యూటీలు కేటాయించిన వారు గురువారం ఉదయం 8 గంటలకు స్పాట్‌లో రిపోర్టు చేయాల్సి ఉంది. ప్రతి ఒక్కరికి ఐడీ కార్డులు ఇస్తున్నామని, క్యాంపులో ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు తప్పక ధరించాలని, వివిధ కారణాలతో మూల్యాంకనం విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో వరలక్ష్మి హెచ్చరించారు. స్పాట్ జరిగే సమయంలో క్యాంపులో ఎవరూ తిరగరాదని, అనవసరంగా బయటకు వెళ్లే ప్రయత్నం చేయరాదన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్పాట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన దాదాపు రెండు లక్షల జవాబు పత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకు సంబంధించి స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన జవాబు పత్రాలను ఇప్పటికే డీకోడ్ చేశారు. స్పాట్ కేంద్రాన్ని నో సెల్‌ఫోన్ జోన్‌గా ప్రకటించారు. మూల్యాంకనం జరిగే సమయంలో ఎవరైనా సిబ్బంది సెల్‌ఫోన్లు ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈవో హెచ్చరించారు. సిబ్బంది సౌకర్యార్థం స్పాట్ కేంద్రంలో సీసీ కెమెరాలతో పాటు బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్స్, క్యాంటీన్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు మరో 14 గదుల్లో ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్‌కు సంబంధించి 18 వేల జవాబు పత్రాలను గురువారం నుంచి సోమవారం వరకు మూల్యాంకనం చేయనున్నారు. కాగా ఈనెల 17న స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యుయేషన్ గురువారంతో ముగియనుంది.

ఆధార్ కార్డుల్లేని చిన్నారులు 23వేలమంది

3, 4,7,8 తేదీల్లో 123చోట్ల ప్రత్యేక శిబిరాలు

సద్వినియోగం చేసుకోవాలంటున్న యంత్రాంగం

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ చాలా అవసరాలకు ఆధార్ కార్డు తప్పనిసరైపోయింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పాలన్నా ఆధార్ అవసరపడుతోంది.ఆధార్ అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం గత ఏడాది నవంబరు నుంచి పలుమార్లు ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది.ఆరేళ్లలోపు చిన్నారులకు కూడా ఆధార్ నమోదు చేయించాలన్న విషయం చాలామంది తల్లిదండ్రులకు తెలియకపోవడంతో జిల్లాలో 23 వేలమంది చిన్నారులకు ఇప్పటికీ ఆధార్ కార్డు లేదు. అన్ని సేవలకూ ప్రభుత్వాలు ఆధార్ తప్పనిసరి చేయడంతో దాని ప్రాధాన్యం తెలియని తల్లిదండ్రులు ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటివారి కోసం జిల్లా వ్యాప్తంగా ఈ నెల 3, 4 , 7,8 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను 123 కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు. బర్త్ సర్టిఫికెట్ లేనివారు, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ లేనివారు ప్రత్యేక శిబిరాల్లో తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. సచివాలయ



డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగులకు ఇందుకోసం ఆధార్ కిట్లను ప్రభుత్వం అందించింది. ఆస్పత్రుల్లో ప్రసవాలు అయిన తరువాత బర్త్ సర్టిఫికెట్లను ఇవ్వాలని చెబుతున్నా క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. సీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులలో ఎక్కువగా ప్రసవాలు జరుగుతున్నాయి. బర్త్ సర్టిఫికెట్ మంజూర్లలో ఆలస్యం కావడంతో ఆధార్‌సేవలకు దూరమవుతున్నారు. ఇలాంటివారంతా ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ జిల్లా అధికారి రవికుమార్ సూచిస్తున్నారు.

3.75 టన్నుల తమిళ బియ్యం స్వాధీనం

శాంతిపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం గెసికపల్లె వద్ద రాళ్ళబూదుగూరు పోలీసులు తమిళనాడు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న మినీటెంపోను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు ...మంగళవారం రాత్రి గెసికపల్లె వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కుప్పం-కేజీఎఫ్ రహదారిలో వస్తున్న మినీ టెంపోను ఆపి తనిఖీ చేయగా అందులో బియ్యం బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. బియ్యం బస్తాలతో పాటూ టెంపోను స్వాధీనం చేసుకున్నారు. 3.75టన్నుల బియ్యాన్ని తమిళనాడు నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తున్నట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రాళ్ళబూదుగూరు పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యంతో బాటూ మినీటెంపో



కుప్పం అడ్డాగా కర్ణాటకకు తమిళ బియ్యం

రామకుప్పం/శాంతిపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నుంచి రేషన్ బియ్యం కుప్పం నియోజకవర్గం మీదుగా కర్ణాటకకు తరలిపోతోంది. వానియంబాడి, ఆంబూరు ప్రాంతాల నుంచి కుప్పం మీదుగా ఈ అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతోంది.అధికార పార్టీ నేతల బంధువులు, అనుచరులు ఇందులో కీలకపాత్ర పోషిస్తుండడం విశేషం.తమిళనాడులో రేషన్ బియ్యాన్ని కిలో రూ.23 నుంచి రూ.25కు కొని సుమోలు, టెంపోల ద్వారా కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తున్నారు. రామకుప్పం మండలం ఆరిమానిపెంట, 89పెద్దూరు, ననియాల, విజలాపురం, గోవిందపల్లెల మీదుగా బియ్యాన్ని శాంతిపురం చేరుస్తారు. అక్కడ డంప్ చేసి రాత్రివేళల్లో వెంకటాపురం, సోమాపురం, 64పెద్దూరు, గెసికపల్లెల మీదుగా సాతు చెక్‌పోస్టు నుంచి, దండికుప్పం, సంతూరు, కేపీమిట్ట, సొన్నేగానిపల్లెల మీదుగా, గోవిందపల్లె, శివరామపురం, రెడ్లపల్లె, తులసినాయనపల్లె, నడింపల్లె, చిన్నారిదొడ్డి, రాళ్ళబూదుగూరు మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నారు. ఒక్కోసారి శాంతిపురం, ముల్లూరు కృష్ణాపురం మీదుగా కూడా బియ్యం రవాణా సాగుతోంది. కుప్పం మండలం నుంచి గుడుపల్లె మండలం శెట్టిపల్లె, ద్రావిడ యూనివర్సిటీ, ఓఎన్‌కొత్తూరు, గుడుపల్లెల మీదుగా కర్ణాటకకు బియ్యం అక్రమ రవాణా సాగుతోంది.కుప్పం మండలం మల్లానూరు, దేవరాజపురం, శాంతిపురం మండలం రామాపురం సమీపంలోని పాలారు నది సమీపంలో, శాంతిపురంలోని శివాలయం వీధి, పాలారు పాత బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేసుకున్న డంపుల్లో బియ్యాన్ని నిల్వచేసి బంగారు పేటకు తరలిస్తున్నారు. అక్కడి రైసుమిల్లర్లకు కిలో బియ్యాన్ని రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. అక్కడి మిల్లర్లు ఆ బియ్యాన్ని పాలిష్ చేసి, సన్నబియ్యంగా మార్చి మన రాష్ట్ర ప్రజలకే అమ్ముతుండడం విశేషం.



వడగాలులు తగ్గుముఖం

ఎండల ధాటికి నిర్మానుష్యంగా మారిన చిత్తూరు సంతపేట హైస్కూల్ రోడ్డు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వడగాలులు తగ్గుముఖం పట్టాయి. బుధవారం అత్యధికంగా నగరి, నింద్ర, ఎస్ఆర్‌పురం మండలాల్లో 36.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో 35.8డిగ్రీలు, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో 35.7, తవణంపల్లెలో 35.6, చిత్తూరు, జీడీ నెల్లూరు మండలాల్లో 35.5, పులిచెర్ల, వెదురుకుప్పం, పూతలపట్టు మండలాల్లో 35.4, గుడిపాలలో 35.3. సదుంలో 35, చౌడేపల్లె, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, యాదమరి, విజయపురం మండలాల్లో 34.8, రొంపిచెర్ల. సోమల మండలాల్లో 34.4, వి.కోటలో 34.3, బంగారుపాళ్యంలో 34.2, బైరెడ్డిపల్లెలో 33.7, కార్వేటినగరంలో 33.8, కుప్పంలో 32.7, పలమనేరు, పుంగనూరు మండలాల్లో 32.5, అతి తక్కువగా రామకుప్పంలో 31.9 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదయ్యాయి.

పన్ను వసూళ్లలో చిత్తూరు బెస్ట్

రాష్ట్రస్థాయిలో ప్రథమ,ద్వితీయ స్థానాలు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి):కొన్ని చోట్ల సిబ్బంది కొరత వున్నప్పటికీ పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో చిత్తూరుకు ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి.దాదాపు వంద రోజులుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ పన్నుల వసూళ్లపై వారం వారం సమీక్షిస్తూ ప్రగతిని పరిశీలిస్తూ వచ్చారు. మరో వైపు పంచాయతీ అధికారులు వందశాతం పన్ను, పన్నేతర వసూళ్లపై గట్టిగా దృష్టి పెట్టారు.రెవెన్యూ డివిజన్లలో డీఎల్‌పీవోలు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముందస్తు నోటీసులు జారీ చేశారు. బకాయిదారుల ఇళ్లకు వెళ్లి కొళాయిలు తొలగిస్తామని హెచ్చరించారు. గత బకాయిలతో కలిపి 2024-25 ఆర్థిక సంవత్సరం పన్ను, పన్నేతర వసూళ్ల లక్ష్యం రూ. 24.25 కోట్లు కాగా రూ. 21.34 కోట్లను వసూలు చేయగలిగారు. పన్నుల రూపంలో గత బకాయిలతో కలిపి 2024-25లో రూ. 17.41 కోట్ల లక్ష్యంలో 85.30 శాతం అంటే రూ. 14.85 కోట్లు వసూలు చేసి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో చిత్తూరు జిల్లాను నిలిపారు. ప్రథమ స్థానంలో పశ్చిమ గోదావరి, తృతీయ స్థానంలో విజయనగరం జిల్లాలు నిలిచాయి.ఇంటి, కొళాయి, లైటింగ్, డ్రైనేజీ తదితరాలకు పన్నులు వసూలు చేశారు. పన్నేతర వసూళ్లలో బకాయితో కలిపి రూ. 6.84 కోట్లు వసూళ్ల లక్ష్యం కాగా 94.88 శాతం అంటే రూ. 6.49 కోట్లు వసూలు చేసి చిత్తూరును ప్రథమ స్థానంలో నిలిపారు. విశాఖపట్నం, తిరుపతి జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పన్నేతర పద్దు కింద అనేక రకాల ఫీజులు, షాపింగ్ కాంప్లెక్సులు, అద్దెలు, ఖాళీ జాగాలు, మార్కెట్, సంతల వేలాలపై పన్నుల వసూళ్లు జరిగాయి.కిందిస్థాయి సిబ్బందిని వసూళ్లకే పరిమితం చేయడం,డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ల పర్యవేక్షణలో సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించి రోజువారీ ప్రగతిని సమీక్షించడం ద్వారా పన్నుల వసూలులో ఈ ప్రగతి సాధ్యమైందని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర రావు తెలిపారు.



జూపార్కు రోడ్డులోని టీసీఎస్ అయాన్ డిజిటల్ జోన్‌లో జరిగిన పరీక్షకు హాజరైన విద్యార్థులు

జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు ప్రారంభం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్-2 పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జూపార్క్ సమీపంలోని అయాన్ డిజిటల్ జోన్‌లో ఈనెల 9 వరకు ఈపరీక్షలు జరుగనున్నాయి. ఉదయం సెషన్‌కు 601 మందికిగాను 40 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 555 మందికిగాను 28 మంది గైర్హాజరయ్యారు. 8.40 గంటలకు ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారని అధికారులు అనుమతించలేదు. వారిద్దరూ నిరాశగా వెనుదిరిగారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కాజూరు చెరువులో పనుల నిలిపివేత

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని కాజూరు చెరువు కబ్జా తాత్కాలికంగా ఆగింది. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'కబ్జాలో కాజూరు చెరువు!' శీర్షికతో వెలువడిన కథనంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. చిత్తూరు అర్బన్ తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి బుధవారం సర్వేయర్, వీఆర్వోతో కలిసి చెరువును పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేయించారు. చెరువులోనే ఏర్పాటు చేసుకున్న మెకానిక్ షెడ్డును ఖాళీ చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. చెరువు కబ్జాపై విచారణ చేసి కారకులపై చర్యలు తీసుకుంటామని తహసీల్దాదర్ తెలిపారు.



చెరువులో ఎక్స్‌కవేటరుతో పనిచేస్తున్న డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర రెడ్డి



వైకుంఠం-1 వద్ద కొత్త షెడ్

● రూ.300 దర్శన భక్తుల కోసం..

నిర్మాణంలో రూ.300 దర్శన భక్తుల అదనపు షెడ్

తిరుమలలో వైకుంఠం1 క్యూకాంప్లెక్స్ వద్ద కొత్త షెడ్ నిర్మాణం జరుగుతోంది. గతంలో రూ.300 దర్శన భక్తుల కోసం ఏర్పాటు చేసిన షెడ్ ప్రస్తుతం ఇరుకుగా మారిపోయింది. క్యూలైన్ కూడా వెలుపలకు వచ్చేస్తోంది. దీంతో రూ.300 దర్శన టికెట్లు బుక్ చేసుకుని దర్శనానికి వస్తున్న భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గుర్తించిన టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అదనపు షెడ్‌ను నిర్మించాలని సూచించారు. సమాచారకేంద్రం వద్దనున్న డిస్ప్లే టీవీ వద్ద నుంచి వైకుంఠం1 కాంప్లెక్స్ ప్రవేశం వరకు అదనపు షెడ్ నిర్మాణం కోసం రూ.1.06 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇది పూర్తయితే వెయ్యి నుంచి 1,500 మంది భక్తులు ఇందులో వేచి ఉండవచ్చు. నెలలో ఈ షెడ్ భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గ్రానైట్ క్వారీలో పేలుళ్లు

● బాలుడికి తీవ్ర గాయాలు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని చెర్లోపల్లెలో గ్రానైట్ క్వారీలో పేలుళ్ల కారణంగా రెండేళ్ల బాలుడు దినేష్ తలకు తీవ్ర గాయమైంది. స్థానికుల కథనం మేరకు.. కృష్ణంరాజుకు చెందిన మామిడి తోటలో రమేష్ కుటుంబం కాపలాగా ఉంటుంది.ఆ పక్కన గ్రానైట్ క్వారీలో బుధవారం మధ్యాహ్నం నిర్వాహకులు పేలుళ్లు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ రాయి రమేష్ కుమారుడు దినేష్‌కు తగలడంతో తలకు తీవ్రగాయమైంది. బాలుడిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నట్లు సమాచారం.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.5.09 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,981

తలనీలాలు సమర్పించినవారు: 21,120



ఇప్పుడు గోదాముకు ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు



గత ఏడాది డిసెంబరులో ఏకొల్లులోని గోదాము చుట్టూ చేరిన వర్షపు నీరు (ఫైల్ ఫోటో)

చెరువులో గోడౌన్

● వైసీపీ పాలనలో ముందుచూపు లేక రూ.40 లక్షలతో నిర్మాణం
● వర్షాల్లో జలదిగ్బంధంలో చిక్కుకున్న వైనం
● ఇప్పుడు మరో రూ.27 లక్షలతో సిమెంటు రోడ్డు
● అధికారుల తీరుపై విమర్శలు

చెరువులో గోదాము కట్టొద్దని అప్పుడే రైతులు మొత్తుకున్నారు. అయినా, నాటి వైసీపీ పాలనలో చెవికెక్కించుకోలేదు. కట్టి తీరతామన్నట్లు భీష్మించారు. ఫలితం.. ఆ తర్వాత వర్షాలకు నీళ్లల్లో చిక్కుకుపోయిందా గోదాము.

ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చింది. అయినా, అధికారుల తీరు మారలేదు. చెరువులోని ఆ గోదాముకు రూ.27 లక్షలతో కొత్తగా రోడ్డేశారు. వైసీపీ పాలకులు చేసిన తప్పును కప్పిపుచ్చడానికే ఈ పని చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

- దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

రైతులు ధాన్యం నిల్వ చేసుకుని, సరైన మద్దతు ధరకు అమ్ముకునేలా 2022లో వైసీపీ ప్రభుత్వం దొరవారిసత్రం మండలానికి నాలుగు గోదాములను మంజూరు చేసింది. ఒక్కో దానికి నాబార్డు ద్వారా ఎన్డీసీసీబీ రుణంతో రూ.40 లక్షలు మంజూరు చేశారు. నెలబల్లి, ఏకొల్లు, వేణుంబాక, తొగరాముడి గ్రామాల్లో.. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో వీటిని నిర్మించారు. నాటి వైసీపీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో ఏకొల్లు గోదామును అనువైన ప్రదేశంలో నిర్మించలేదు. ఏకొల్లు రోడ్డుకు పక్కనే, రెడ్డిగుంట చెరువులో నిర్మించారు. దీనివల్ల ఆ గోదాము రైతులకు ఉపయోగపడదనే విషయాన్ని అధికారులు నిర్లక్ష్యంగా తీసుకొన్నారు. దీంతో లక్ష్యం మంచిదైనా ఆచరణలో నీరుగారింది. గత వర్షాకాలంలో చెరువు నీరు గోదామును చుట్టుముట్టేయడంతో రైతులంతా ఆవేదన వ్యక్తంచేశారు.



సిమెంట్ రోడ్డు పనులకోసం.. పక్కనే చెరువు మట్టి తీయడంతో ఏర్పడిన గుంత

దీనిని గుర్తించినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. ఇలా గత ప్రభుత్వంలో రూ.40 లక్షలను 'నీటి'పాలు చేశారు.

ఆ రోడ్డూ అంతంతమాత్రమే

2023-24లో నీటిలో గోదాము జలదిగ్బంధమైన వైనాన్ని అధికార యంత్రాంగం కళ్లారా చూసినా మేలుకోలేదు. సరికదా మరో తప్పిదానికి పాల్పడింది. రూ.27 లక్షలతో అక్క సిమెంట్ రోడ్డు వేయించింది. ప్రస్తుత ప్రభుత్వం రోడ్లకు నిధులు ఇవ్వడాన్ని అధికారులు తమకు అనుకూలంగా మలచుకుని.. గతంలో తమ తప్పు బయటపడకుండా ఆదరాబాదరాగా లోతట్టు ప్రాంతంలోని గోదాముకు రోడ్డు వేయించారు. దీనికితోడు అక్కడే ఉన్న చెరువులో తవ్విన మట్టితో రోడ్డు వేశారు. దీనిపైనే సిమెంట్ రోడ్డు వేశారు. మట్టి పనుల్లో కనీసం రోలింగ్ నియమాన్ని పాటించలేదనే విమర్శలున్నాయి. రోడ్డుకు ఆనుకునే మట్టిని తవ్వారు. సిమెంట్ రోడ్డు పనుల్లోనూ నాణ్యత కొరవడింది. వర్షాకాల ంలో ఈ రోడ్డు వరద తాకిడికి కొట్టుకుపోయే ప్రమాదముందనే ఆందోళన వ్యక్తమవుతోంది. సమీపంలోనే తెలుగంగ కాలువ ఉంది. ఈ కాలువకు గత డిసెంబరులో పడిన గండిని ఇప్పటికీ పూడ్చలేదు. ఆ గండి ద్వారా వరద నీరొస్తే గోదామును ముంచెత్తుతుందంటున్నారు. జాతీయ రహదారి పక్కన ఖాళీ భూమిలో గోదాము నిర్మించి ఉంటే ఉపయోగపడే బాగుండేదని రైతులు చెబుతున్నారు.

వీఆర్‌కు గాజులమండ్యం హెడ్ కానిస్టేబుల్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధన రాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు ఎనిమిదేళ్లుగా ఒకేచోట ఉంటున్న ఈయనపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది. దీనిపై ఎస్పీ నందిస్తూ స్పెషల్ బ్రాంచ్ అధికారులను విచారణకు ఆదేశించారు. వీటన్నింటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన ఎస్‌బీ అధికారులు ఎస్పీకి నివేదిక సమర్పించారు. దీనిపై వెంటనే హెడ్ కానిస్టేబుల్ పెద్దిరెడ్డి రామకృష్ణారెడ్డిని వీఆర్‌కు పంపుతూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎవరైనా సరే భూదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బీజేపీ సీనియర్ నేత ధనంజయులు మృతి



ధనంజయులు నాయుడు (ఫైల్ ఫొటో)

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, తిరుపతికి చెందిన గాలి ధనంజయులు నాయుడు(83) మృతిచెందారు. బైరాగిపట్టెడ ఎంకే నాయుడు కాలనీలోని ఆయన స్వగృహంలో బుధవారం సాయంత్రం కార్డియాక్ అరెస్ట్‌తో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె, బీజేపీ నాయకురాలు గాలి పుష్పలత చెప్పారు. ఈయన 1977కు ముందునుంచే జనతా పార్టీలో పనిచేశారు. 1980లో బీజేపీగా రూపాంతరం చెందడంతో అందులోనూ చురుగ్గా పనిచేశారు. 1985లో బీజేపీ నగర అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1990లో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. 1999లో రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. తన కుమార్తె గాలి పుష్పలతను వారసురాలిగా రాజకీయ క్షేత్రంలోకి దింపారు. కుమారుడు గాలి భరత్ కుటుంబం అమెరికాలో ఉండటంతో ఆయన వచ్చాక శుక్రవారం ఉదయం గోవిందధామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పార్థివదేహాన్ని స్విమ్స్ మార్చురీలో భద్రపరిచారు.





విద్యుత్ దీపాలంకరణలో దర్గా, ఆర్చి

నేటినుంచి హజరత్ అమీర్‌షావలి ఉరుసు

● ఎమ్మెల్యే విజయశ్రీ చొరవతో 8 ఏళ్ల తరువాత ప్రారంభం

నాయుడుపేట/టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీకగా.. కులమతాలకు అతీతంగా జరుపుకునే హజరత్ అమీర్‌షావలి గంధోత్సవ వేడుకలు గురువారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. 3, 4, 5 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉరుసు ఉత్సవాలను మొదటసారి 1960లో ప్రారంభించారు. అప్పటి నుంచి హిందూ.. ముస్లింలు కులమతాలకు అతీతంగా ఐక్యతతో ఉరుసు జరుపుకుంటుండంతో ప్రత్యేకత సంతరించుకుంది. 2016 వరకు నిర్విఘ్నంగా సాగిన ఉరుసు ఉత్సవాలు... నిర్వహణ విషయమై వివాదాలు నెలకొనడంతో 2017 నుంచి ఆగిపోయాయి. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం చొరవ తీసుకొని కమిటీ సభ్యులతో సంప్రదింపులు జరిపి ఈ ఏడాది ఉరుసు నిర్వహించేందుకు కృషి చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా 3వ తేదీ గురువారం రాత్రి శ్రీవారి గంధం... దొర్నాదుల చెంచుకృష్ణయ్య ఇంటి వద్ద నుంచి బయలుదేరి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, ఫకీర్ల భజనల నడుమ పట్టణంతా ఊరేగి తెల్లవారుజామున దర్గా వద్దకు చేరుకొని రాహూరు వారి చేత చదివింపులు స్వీకరిస్తారు. 4వ తేదీ శుక్రవారం రాత్రి 8 గంటలకు నిస్మి ఈవెంట్స్ ఆధ్వర్యంలో సినీ పాటకచ్చేరి. 5వ తేదీ శనివారం మధ్యాహ్నం అన్నదానం, రాత్రి జబర్దస్త్ టీమ్ ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఉరుసు ఉత్సవాలకు ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు రానుండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 14 మంది ఎస్ఐలు, 212 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

● 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి
● 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉంటూ మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టాయి. ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వకపోవడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా 12వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేసి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ వారిని పాతపెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డీఈవో, డైట్ ప్రిన్సిపాల్, డీఈవో పోస్టులు అందని ద్రాక్షలా మారాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 3 పెండింగ్ డీఏను వెంటనే విడుదల డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సీహెచ్ రమేష్, గాజుల నాగేశ్వరరావు, శేఖర్, రామచంద్రయ్య, మురళీకృష్ణ, జగన్నాథం, రమేష్, బాలసుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, మల్లికార్జున, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు ప్రారంభం

● పర్యవేక్షించిన ఇన్‌చార్జి వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ దూరవిద్యా పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో 53 కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో కల్పించిన వసతుల పట్ల వీసీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణపై కోర్టు, యూజీసీ, డెబ్ ఆదేశాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

గంజాయితో పట్టుబడిన తల్లీ కొడుకులు



పుత్తూరు అర్బన్/ వడమాలపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చేసిన తప్పునే మళ్లీ చేసి పట్టుబడిందో మహిళ. ఈసారి కుమారుడు తోడయ్యాడు. పుత్తూరు ఎక్సైజ్ సీఐ, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా వడమాలపేటలో దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తూ వడమాలపేట గుంటకట్టకు చెందిన కె.వల్లెమ్మ, ఆమె కుమారుడు డిల్లీప్రసాద్ పట్టుబడ్డారు. ఈమె ఇంట్లో తనిఖీ చేయగా రూ.9,600 విలువైన 700 గ్రాముల గంజాయి, లావాదేవీలు జరిపిన మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు. కాగా, వల్లెమ్మ 2016-17లో గంజాయి కేసులో అరెస్టయి ఏడాది జైలు శిక్ష అనుభవించడంతో పాటు రూ.10 వేలు జరిమానా చెల్లించినట్లు సీఐ మురళీ మోహన్ తెలిపారు. ఎస్ఐలు శివప్రసాద్, స్వామినాథన్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఆరుగురు కిడ్నాపర్లు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక లావాదేవీలు.. మీ సేవలో నెలకొన్న విభేదాల కారణంగా రాజేష్ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఘటనలో ఆరుగురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. ఈనెల 29న తిరుపతి నగరం అక్కారాంపల్లికి చెందిన అరుణ్, జీవకోనకు చెందిన భార్గవ్‌తో పాటు రేణిగుంటకు చెందిన మరో నలుగురు కలిసి కిడ్నాప్ చేసిన విషయం విదితమే. రాజేష్, భార్గవ్ చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఎలాగైనా రాజేష్ నుంచి రూ.రెండు కోట్లు దండుకోవాలనే దురుద్దేశంతో కిడ్నాప్‌కు పథకం రచించారు. దీని కోసం సెటిల్‌మెంట్లు, భూ దందాల్లో ఆరితేరిన అరుణ్‌ను సంప్రదించాడు. ఆ ప్రకారం ఈ నెల 29న రాజేష్‌ను అపార్టుమెంటు వద్దకు రావాలని ఫోనులో పిలిచాడు. గతంలో తన వద్ద తీసుకున్న రూ.20 లక్షలను తిరిగివ్వాలని రాజేష్ కొంతకాలంగా అడుగుతుండటం, భార్గవ్ వైఖరిపై అనుమానంతో ఇతడు తల్లి విజయ, భార్య సుమతి, ఇద్దరు పిల్లలతో కలిసి వెళ్లాడు. తనకు రూ.రెండు కోట్లు ఇవ్వాలని భార్గవ్, అరుణ్ కలసి రాజేష్‌ను అడగ్గా అంత డబ్బులు లేవని చెప్పారు. అయితే ఇల్లు, ఆస్తులు రాసివ్వాలని బెదిరించారు. దీనికోసం రాజేష్‌ను ఒక కారులో, అతడి కుటుంబ సభ్యులను మరో కారులో ఎక్కించుకుని బెంగళూరు వైపు వెళ్లారు. ఈ సందర్భంగా కిడ్నాపర్లు కొన్ని మారణాయుధాలతో బెదిరించినట్లు సమాచారం. రాజేష్ తప్పించుకోవడం, సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అందరినీ వదిలేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన అరుణ్‌తో పాటు భార్గవ్, రేణిగుంటకు చెందిన మరో నలుగురిని అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఘటన జరిగిన మరుసటి రోజు కిడ్నాపర్ల కదలికలపై సీఐ రాంకిషోర్, అలిపిరి ఎస్ఐలు నాగార్జున రెడ్డి, లోకేష్ బాబు నిఘా ఉంచి చాకచక్యంగా బెంగళూరు, హైదరాబాదుకు వెళుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇద్దరు ప్రధాన నిందితులపై రౌడీషీట్‌లు ఓపెన్ చేసే యోచనలో పోలీసులున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ నరసింహరావు

భూగర్భ డ్రైనేజీ క్లీన్ చేస్తూ కార్మికుడి మృతి

● అపస్మారక స్థితిలో మరో ఇద్దరు



నాగరాజు (ఫైల్‌ఫొటో)



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తోట శివ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట షార్ ఉద్యోగుల కాలనీ కేఆర్ పాలెంలో భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలను తొలగించే క్రమంగా ఊపిరాడక కార్మికుడు నాగరాజు(41) మృతి చెందగా, మరో ఇద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. పోలీసుల సమాచారం మేరకు.. ఇక్కడి భూగర్భ డ్రైనేజీలో వ్యర్థాలు నిల్వచేరి.. మురుగు ముందుకు సాగక దుర్వాసన వస్తోంది. దీనిని శుభ్రం చేసేందుకు బుధవారం నలుగురు కూలీలు వచ్చారు. మ్యాన్‌హోల్ నుంచి నాగరాజు లోపలకు దిగారు. వ్యర్థాలను కాస్త తొలగించగా, ఎగువ నుంచి మురుగునీరు వచ్చింది. ఆ దుర్వాసన, వాయువులతో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరారు. పది నిమిషాల తరువాత నాగరాజును పిలిచినా స్పందన లేకపోవడంతో తోట గురువయ్య అనే మరో కార్మికుడు దిగారు. ఎంతసేపటికీ వీరిద్దరు బయటకు రాకపోవడంతో శివ, తుపాకుల ధర్మ లోపలకు దిగారు. అప్పటికే నాగరాజు మృతి చెందగా, గురవయ్య అపస్మాకర స్థితిలో ఉన్నారు. వెంటనే నాగరాజు మృతదేహంతో పాటు గురవయ్యను బయటకు తీసుకొచ్చారు. అదే సమయంలో శివ కూడా అపస్మారక స్థితికి చేరారు. వెంటనే షార్ రోడ్డులోని సతీష్‌ధావన్ మెమోరియల్ వైద్యశాలకు తరలించారు. ప్రథమిక చికిత్స అనంతరం తోట శివ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ నరసింహారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనేది ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నాగరాజు స్వగ్రామం సూళ్లూరుపేట మండలంలోని దావాదిగుంట. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



జింక కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ఎస్వీయూలో చిరుత దాడిలో జింక మృతి


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో ఓ జింకను చిరుత చంపినట్టు తెలుస్తోంది. ఈ ఘటనను బుధవారం సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుత సంచారం ఆనవాళ్లను పరిశీలించారు. యూనివర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. కొన్ని రోజులుగా ఎస్వీయూలో సెంట్రల్ లైబ్రరీ, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాల్లో చిరుత సంచారం కనిపిస్తోంది. లైబ్రరీ, ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంతాల్లో కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు జింకలను చంపడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది.



నడకదారిలో సగం మెట్లు దాటగానే అలసిపోతున్నారు. ఛాతీ నొప్పితో కుప్పకూలుతున్నారు. నిర్జీవులుగా మారుతున్నారు కొందరు.

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ మరికొందరు గుండె పట్టుకుని విలవిలలాడుతూ కూర్చుంటున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లే సరికి విగతజీవులవుతున్నారు.

దైవదర్శనానికి వచ్చే భక్తుల్లో గుండెపోటు మరణాలు ఇటీవల పెరిగాయి. ఏడాది కాలంలో దాదాపు 157 మంది భక్తులు గుండెపోటుతో మృతి చెందడం టీటీడీని కలవరపరిచింది. ఈ క్రమంలో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టింది.



నడకదారుల్లో గుండెపోటు



అలిపిరి నడకమార్గం

ఇటీవల పెరిగిన మరణాలు

తిరుమలలోని ముఖ్య ప్రదేశాల్లోనూ ఇదే పరిస్థితి

ఏడాది కాలంలో 157 మంది మృత్యువాత

నివారణపై దృష్టిసారించిన టీటీడీ

తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి దర్శనానికి వచ్చేవారిలో దాదాపు 40 శాతం మంది భక్తులు తమకున్న మొక్కుల మేరకు అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గాల్లో తిరుమలకు చేరుకుంటారు. అయితే కొవిడ్ అనంతరం కాలినడకన వచ్చే భక్తుల్లో చాలా మంది గుండెపోటుతో మృతి చెందుతుండటం టీటీడీకి ఆందోళన కలిగిస్తోంది. అప్పటివరకు బాగానే ఉన్న యాత్రికులు ఛాతీ నొప్పి అంటూ కుప్పకూలిపోయి కుటుంబానికి దూరమవుతున్నారు. ఒక కాలినడక మార్గాల్లోనే కాకుండా కంపార్టుమెంట్లు, క్యూలైన్లు, తిరుమలలోని కొన్ని ముఖ్యమైన ప్రదేశాల్లోనూ గుండెపోటు మరణాలు నమోదవుతున్నాయి.





గతేడాది డిసెంబరు 13న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సీహెచ్ రవికుమార్ (ఇన్‌సెట్‌లో) రవికుమార్ మృతదేహం

ఇదీ లెక్క

గతేడాది జనవరిలో 14 మంది, ఫిబ్రవరిలో 11, మార్చిలో 12, ఏప్రిల్ 7, మే 8, జూన్ 11, జూలై 17, ఆగస్టు 9, సెప్టెంబరు 15, అక్టోబరు 10, నంబరు 8, డిసెంబరు 10, ఈఏడాది జనవరి 15, ఫిబ్రవరి 8, మార్చిలో (ఇప్పటి వరకు) ఇద్దరు చొప్పున 157 మంది గుండెపోటుతో చనిపోయారు. కాగా, మరికొందరు తీవ్ర అస్వస్థతతో తిరుపతిలోని వివిధ ఆస్పత్రుల్లో చేరి మృతి చెందిన సందర్భాలూ ఉన్నాయి.



గతేడాది డిసెంబరు14న మృతిచెందడానికి ముందు అలిపిరిలో సెల్ఫీ తీసుకున్న నవనీత్ (ఇన్‌సెట్‌లో) నవనీత్ మృతదేహం

ఏడవ మైలు వద్ద అపోలో కేంద్రం

మరోవైపు శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అపోలో సంస్థ కొన్నేళ్లుగా ఉచితసేవలు అందిస్తోంది. అశ్విని ఆస్పత్రి పక్కనే ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఛాతీ నొప్పి అంటూ వచ్చేవారికి వివిధ రకాల పరీక్షలు చేయడంతో పాటు అత్యంత ఖరీదైన టెనెక్టిప్లెస్ అనే ఇంజెక్షన్ కూడా ఉచితంగా వేస్తున్నారు. ఇక, నడక మార్గాల్లో పెరుగుతున్న గుండెపోటు మరణాలను దృష్టిలో పెట్టుకుని అలిపిరి మెట్ల మార్గంలోని ఏడో మైలు వద్ద అపోలో సంస్థ 'అత్యవసర హృదయ చికిత్స కేంద్రం' ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. త్వరలోనే ఈసీజీ, డీఫిబ్ రిలేటర్, ఎకో కార్డియోగ్రామ్ వంటి పరికరాలతో వైద్యులను నియమించనున్నారు.

మరణాల నివారణ కోసం..

కాలినడకన వస్తూ తీవ్ర అలసటతో చాలా మంది భక్తులు మృతిచెందినట్టు టీటీడీ గుర్తించిది. అలాగే అనారోగ్యంతో ఉన్నవారూ మొక్కు తీర్చుకోవాలనే మొండితనంతో కొండెక్కుతూ చనిపోయినట్టు కూడా వైద్యుల ద్వారా తెలిసింది. ఈక్రమంలో శ్రీవారి దర్శనం కోసం వస్తూ గుండెపోటుతో ఇకపై ఎవరు మరణించకూడదనే లక్ష్యంతో టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. 60 ఏళ్ల దాటిన వృద్ధులు, గుండె సంబంధిత, మధుమేహం, అధిక రక్తపోటు, ఉబ్బసం, మూర్ఛ వంటి వ్యాధులున్న వారు కాలినడకన వెళ్లడం మంచిది కాదంటూ బ్రాడ్‌కాస్టింగ్ ద్వారా టీటీడీ సూచిస్తోంది.

- అలిపిరి నడకమార్గంలో ఇప్పటికే 1,500వ మెట్టు, గాలిగోపురం, భాష్యకార్ల సన్నిధి ప్రాంతాల్లో డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో సరిపడా వైద్యులను ఏర్పాటు చేయాలనే అధికారుల ఆదేశాల మేరకు గుండెకు సంబంధించిన ప్రత్యేక నిపుణలు ఏర్పాటు చేశారు. ఒక్కో డిస్పెన్సరీలో నలుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లో ఈసీజీ, డీ ఫిబ్‌రిలేటర్ వంటి పరికరాలను, క్యాన్వాస్ స్ట్రచర్స్‌ను సమకూర్చుకున్నారు.
- ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని 1,200వ మెట్టు వద్ద కూడా మరో డిస్పెన్సరీని ఏర్పాటు చేసే అంశంపై టీటీడీ ప్రణాళిక రూపొందించుకుంటోంది.
- భక్తులు దర్శనం కోసం వేచిఉండే వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో ఉన్న డిస్పెన్సరీలోనూ సరిపడా వైద్యులను ఏర్పాటు చేయనున్నారు.
- వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోనూ నూతన డిస్పెన్సరీ ఏర్పాటుపై కసరత్తు చేస్తున్నారు. ఇటీవల 13 మంది వైద్య సిబ్బందిని కూడా కొత్తగా నియమించారు. ఇక, భక్తులు ఏదైనా ఇబ్బందికి గురైతే వైద్యులు వచ్చేవరకు నిరీక్షించకుండా సమీపంలోని సిబ్బందే సీపీఆర్ చేసేలా శిక్షణ ఇస్తున్నారు.

మాకొక ఇంచార్జి కావలెను!

- టీడీపీ కేంద్ర కార్యాలయానికి సత్యవేడు పంచాయితీ



పల్లా శ్రీనివాసరావును కలిసిన టీడీపీ నేతలు

సత్యవేడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ టీడీపీ వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది. ఎమ్మెల్యే ఆదిమూలం తీరుపై నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి వ్యక్తం చేస్తూ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే స్థానంలో ఎవరినైనా ఇన్‌చార్జిని నియమించాలని కోరినట్లు సమాచారం. ఏపీ యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నరసింహయాదవ్ ప్రమాణ స్వీకారానికి నియోజకవర్గం నుంచి విజయవాడకు వెళ్లిన టీడీపీ నేతలు ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కేంద్ర కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వైసీపీ నేతలకే ఆయన ఎక్కువ ప్రాధాన్యమిస్తూ టీడీపీ నేతలను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు, బాధలు పడ్డామని, ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చినా అవే పరిస్థితులు ఎదుర్కొంటున్నామని ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిసింది. నియోజకవర్గంలో అధికారుల నుంచి సిబ్బంది వరకు వైసీపీ నేతల మాటలే చెల్లుబాటు అవుతున్నాయని, దీనికి ఎమ్మెల్యే కుమారుడి ప్రమేయమే ప్రధాన కారణమని పల్లాకు వారు వివరించినట్లు సమాచారం. ఎమ్మెల్యే ఆదిమూలంతో వేగలేమని త్వరలో నియోజకవర్గానికి ఇంచార్జిని నియమిస్తే తామందరం కలిసి పనిచేస్తామని, లేకుంటే పార్టీకి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పినట్లు తెలిసింది. నియోజకవర్గ టీడీపీ నేతల ఫిర్యాదు విన్న పల్లా.. మీకు ఇంచార్జిగా ఎవరు కావాలని అడగ్గా పలువురు మాజీ ఎమ్మెల్యే హేమలత పేరు ప్రస్తావించినట్లు సమాచారం. పార్టీ అధినేత చంద్రబాబుతో చర్చించి ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.


12వ పీఆర్సీని ఏర్పాటు చేయాలి: ఫ్యాప్టో



కలెక్టరేట్ ముందు టీచర్ల నిరసన

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): 12వ పీఆర్సీ ఏర్పాటుతో పాటు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని ఫ్యాప్టో డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ ముందు ఫ్యాప్టో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మణిగండన్, మునీర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యారంగంలో పాఠశాల విద్యను విధ్వంసం చేసిన జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో రద్దుకు ప్రభుత్వం అంగీకరించినా, తెలుగు మీడియం, మైనర్ మీడియంలను పునరుద్ధరించడానికి అంగీకరించక పోవడం బాధాకరమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిమగ్నమై పని చేయడానికి ఉన్న ఆర్థిక అడ్డంకులు తొలగించాలని కోరారు. వైద్య ఖర్చులు అధికం కావడంతో పీఆర్సీ డీఏల ప్రకటనకు పెన్షనర్లు ఎదురుచూస్తున్నారన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర నేతలు గంటా మోహన్, రమణ మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో నంబరు 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలన్నారు. అనంతరం డీఆర్వో మోహన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు రామమూర్తి, మదన్మోహన్, ముక్తార్, మునాఫ్, సోమశేఖర్ నాయుడు, మోహన్‌యాదవ్, కిరణ్, లక్ష్మీపతి, బర్కత్సా, జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారి పనుల్లో ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



రహదారి పనుల ఆలస్యంపై కాంట్రాక్టర్‌ను వివరాలు అడుగుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

యాదమరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - గుడియాత్తం అంతరాష్ట్ర రహదారి పనులు నత్తనడకన సాగుతుండడంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్ధేశించిన సమయానికి పనులు పూర్తిచేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. డిసెంబర్ నెలలో ప్రారంభించిన ఈ రహదారి మరమ్మతు పనుల పురోగతిని ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. రహదారి పనులు నత్తనడకన సాగుతుండడంతో విస్మయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... జోడిచింతల నుంచి కన్నికాపురం వరకు రహదారి పనులను సగం వరకు పూర్తిచేసి, మిగతా పనులు ఆలస్యం కావడంతో ఎందుకు పూర్తిచేయలేదని కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులను ప్రశ్నించారు.కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ ధనలక్ష్మి, ఏఈ ఆదికేశవులు, తహసీల్దార్ పార్థసారథి ఎంపీడీవో వేణు, ఎస్ఐ ఈశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ వ్యవసాయ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలి

- ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరురూరల్,ఏప్రిల్2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీసులను వెంటనే మంజూరు చేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక గిరింపేటలో ఉన్న ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ గతంలో ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలు లేక వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. ఇప్పుడు పూర్తిస్థాయిలో పరికరాలు అందుబాటులో ఉన్నాయని,పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మరమ్మతుకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్పుచేసి అందించాలన్నారు. రాత్రుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి పునరుద్ధరించాలని ఆదేశించారు. అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ లోడ్‌ను పెంచాలన్నారు. ఆర్డీఎస్ఎస్ పనుల్లో భాగంగా చెట్లను తొలగిస్తున్నారని... కొమ్మలు తొలగిస్తే సరిపోతుందన్నారు. ఈ సమావేశంలో ఈఈ మునిచంద్ర, సురేష్, వాసుదేవరెడ్డి, అమర్‌బాబు, జగదీష్, ఏవో ప్రసన్నాంజనేయులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడులు





పిల్లారిపెంట వద్ద ఏనుగులు తొక్కేసిన వరిపంట - ఏనుగులను తమిళనాడు వైపు డ్రైవ్ చేస్తున్న అటవీ సిబ్బంది

యాదమరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. యాదమరి సరిహద్దులో తిష్టవేసిన గజరాజుల గుంపు అటవీ సమీప గ్రామాల పంటలపై దాడులు చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి 14 ఏనుగుల గుంపు దళవాయిపల్లి, మాదిరెడ్డిపల్లి, తాళ్లమడుగు సమీపంలోని వరి, అరటి, చెరకు పంటలను ధ్వంసం చేసినట్లు బాధిత రైతులు తెలిపారు. మూడు ఏనుగుల గుంపు చిన్నరెడ్డిపల్లి, పిల్లారిపెంట, వరదరాజులపల్లి, కట్టకిందవూరు గ్రామాల రైతులు యోగానంద, కృష్ణలకు చెందిన వరి, మామిడి, అరటి, రాగి పంటలపై, యాదమరికి చెందిన నిత్యారెడ్డి, ఖలీల్ బాషా పంటలను తొక్కి ఫెన్సింగ్ విరిచేశాయి.

● తమిళనాడు సరిహద్దులకు తరలింపు

పంటలపై ఏనుగుల దాడులు చేయకుండా అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు అటవీ సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. కుప్పం నుంచి అదనంగా వచ్చిన సిబ్బందితో తమిళనాడు అటవీ ప్రాంతంలోకి తరలించేందుకు సిబ్బంది దాదాపు 12 కి.మీ. దూరం ప్రత్యేక డ్రైవ్ చేసుకుంటూ వెళ్లినట్లు ఎఫ్ఎస్‌వో మోహనమురళి తెలిపారు. ఒక వైపు ఏనుగుల గుంపు దాడులు, మరోవైపు పంట పొలాల ధ్వంసంతో రైతులు నష్టాల బారినపడి కుదేలవుతున్నారు. ప్రభుత్వం తక్షణమే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుప్పం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్!

- వ్యక్తిగత, సామాజిక మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం
- అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందాల ద్వారా ఉద్యోగ కల్పన
- కడా పీడీ వికాస్ మర్మత్



కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి పక్కా మాస్టర్ ప్లాన్ వేస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. వ్యక్తిగత, సామాజిక మౌలిక సదుపాయాల కల్పన చేస్తూనే, అంతర్జాతీయ కంపెనీలతో ఒప్పందాల ద్వారా ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 11 వేల పక్కా ఇళ్ల నిర్మాణాన్ని మరో మూడు నెలల్లో చేపడతామని చెప్పారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గండికోటనుంచి నీటిని కుప్పం తీసుకు రావడానికి ప్రణాళికలు తయారవుతున్నాయన్నారు.ప్రస్తుతం పింఛన్ల అర్హుల విషయంలో సర్వే జరుగుతోందన్నారు. పెన్షన్ అప్రూవల్స్ ఈ నెలలో పూర్తి చేసి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గానికి 1500 గోకులం షెడ్లు మంజూరయ్యాయని, వీటిలో 500 షెడ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఆర్ అండ్ బి రోడ్ల నిర్మాణానికి రూ.53 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయన్నారు. వీటిని జూన్ నెలలోగా పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు.సదరం శిబిరం ద్వారా 5175 మంది దివ్యాంగులకు ధృవీకరణ పత్రాలను రెండు రోజుల్లో మంజూరు చేయడం ఒక రికార్డుగా పేర్కొన్నారు.ఫ్రంటియర్ మార్కెట్ కన్సల్టెంట్ ద్వారా మహిళలకు మొబైల్ ద్వారా నిర్వహించగలిగే ఆర్థిక లావాదేవీలను వినియోగించే విధానంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అలీప్, కేర్ అండ్ గ్రో వంటి అనేక జాతీయ, అంతర్జాతీయ కన్సల్టెంట్స్, కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా ఇప్పటికే 345 మందికి ఉద్యోగాల కల్పన చేశామన్నారు. ఇంకా పలు కంపెనీలతో ఒప్పందాల ద్వారా రాబోయే అయిదేళ్లలో కనీసం 30 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని కడా పీడీ వికాస్ మర్మత్ హామీ ఇచ్చారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికోసం మాస్టర్ ప్లాన్‌ను శాస్త్ర సాంకేతిక పద్ధతుల ద్వారా సశాస్త్రీయంగా రూపొందించడానికి ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. సమర్థమైన కన్సల్టెన్సీ కంపెనీతో సమగ్ర సర్వే ద్వారా రూట్ మ్యాప్ తయారు చేస్తామన్నారు. ఈ సర్వే జూన్ నెలలోనే ప్రారంభమయిందన్నారు. విమానాశ్రయం నిర్మాణానికి 1800 ఎకరాలను సేకకరించామన్నారు. ఇందులో 1200 ఎకరాలలో విమానాశ్రయం నిర్మించి, మిగిలిన 600 ఎకరాలను పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేస్తామని, ఇందులో పలురకాల పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ కల్పన చేస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్ తర్వాతనే కుప్పం మున్సిపాలిటీ పరిధిలో అన్నిరకాల అభివృద్ధి పనులు ప్రారంభమై వేగం పుంజుకుంటాయన్నారు. భూగర్భ మురుగు కాలువల నిర్మాణం, రోడ్ల విస్తరణ వంటి పనులన్నీ మాస్టర్ ప్లాన్‌తో పక్కాగా చేపట్టి పూర్తి చేస్తామని పీడీ తెలిపారు. మున్సిపాలిటీకి నూతనంగా మంజూరైన 44 పోస్టులను రెండుమూడు నెలలో భర్తీ చేస్తామని చెప్పారు. నక్ష సర్వేపై ఎటువంటి అపోహలు వద్దని, ప్రజల ఆస్తుల పరిరక్షణకోసమే ఈ సర్వే జరిపి రికార్డులు పక్కాగా రూపొందిస్తామని పీడీ తెలిపారు.

మండలానికో మోడల్ ఫారంపాండ్:కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూ గర్భ జలాల పెంపులో భాగంగా ఫారమ్‌పాండ్స్ నిర్మాణంపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.ఉపాధి హామీ పథకంపై మంజూరైన పనుల పురోగతిపై పీడీ రవికుమార్‌తో కలిసి బుధవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఒక మోడల్ ఫారమ్‌పాండ్‌ను నిర్మించాలన్నారు. రైతులకు వాటి గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. నాణ్యతతో నిర్మాణాలు చేపట్టాలన్నారు. మ్యాట్స్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర అధికారులందరూ రైతులకు ఉపయోగపడేలా పెద్ద ఎత్తున నిర్మాణాలుచేపట్టాలన్నారు.





లగేజీ కౌంటర్ వద్ద భక్తుల రద్దీ - నడక మార్గంలో..



పాదాల మండపం వద్ద..

అలిపిరిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్, టెన్త్ పరీక్షలు పూర్తి కావడంతో తిరుమలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో అలిపిరిలో హడావుడి నెలకొంది. కాలినడక వెళ్లే వారితో పాటు వాహనాలు, లగేజీ డిపాజిట్ చేసే ప్రాంతంలో రద్దీ నెలకొంది.

పశువైద్యాధికారికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకుంటున్న పశువైద్యాధికారి చందనప్రియ

సోమల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం పెద్దఉప్పరపల్లె పశు వైద్యాధికారిణి డాక్టర్ మారసాని చందనప్రియ బుధవారం విజయవాడలో పశు సవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. పశువైద్య సేవల్లో ఉత్తమ సేవలకు గుర్తింపుగా అవార్డును స్వీకరించారు. అలాగే మండలంలోని వల్లిగట్ల పశుసంవర్ధక శాఖ సహాయకులు మహేశ్ అవార్డు అందుకున్నారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

భూముల సర్వేపై అవగాహన ర్యాలీ



రామకుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో రెండో విడత పైలట్ ప్రాజెక్టు భూసర్వే చేపట్టనున్న కెంచనబల్ల, అడవిపామన బోయపల్లె గ్రామాల్లో బుధవారం మండల డిప్యూటీ తహసీల్దారు బాలాజీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీసర్వేలో తొలుత గ్రామాల సరిహద్దులను గుర్తించి ప్రభుత్వ భూముల హద్దులను నిర్ధారిస్తామన్నారు. చివరగా రైతులకు సంబందించి సెటిల్మెంట్, డీకేటీ భూములను సర్వే చేపడుతామని తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ వద్ద ఉన్న భూ రికార్డులను తీసుకొచ్చి సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల టీడీపీ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, పెరుమాళ్, శ్రీనాథరెడ్డి, గుణశేఖర్, మునిరెడ్డి, మురళీమోహన్, ఆనందరెడ్డి, మండల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంచే సాధనమే విద్య



ఎంఈవోలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పలమనేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్య అనేది జ్ఞానాన్ని పెంచే సాధనమని.. విద్య మన ఆలోచనలను విస్తరింపజేస్తుందని మండల విద్యాశాఖాధికారులు లీలారాణి, బాలసుందరం పేర్కొన్నారు. బుధవారం పలమనేరు నార్త్ పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి లక్ష్యాలను చేరుకోవాలని.. ఇందుకు విద్యను ఒక సాధనంగా వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారులను ఉపాధ్యాయులు శాలువలతో ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు లత, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, పాఠశాల విద్యాకమిటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం



పద్యాల పుస్తకాలతో విద్యార్థులు

గంగవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానమని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా వివిధ రకాల పద్యాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరికీ సెల్‌ఫోన్లు ఓ వ్యసనంగా మారిపోతున్నాయన్నారు. పుస్తకాలపై మక్కువ పెంచుకొని జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న నేత్ర వైద్యులు

పలమనేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరంలో ఎంపికైన వారికి బుధవారం పలమనేరులో ఉచిత కళ్ల జోళ్లను పంపిణీ చేశారు. గత 15 రోజులకు ముందు తిరుపతికి చెందిన అమెరికన్ ఐ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 60 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేశారు. పీపీఎస్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఎన్జీవో అధ్యక్షులు ఆనందబాబు, పీపీఎస్ కార్యదర్శి నరసింహులు, కోశాధికారి సన్నిరాజు, నారాయణ, దొరస్వామి, సాంబయ్య, విజయ్, కుమార్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుల నియామకం



సుబ్రహ్మణ్యం, నంజప్ప, మునస్వామి, కృష్ణప్పగౌడు, నిజాం

రామకుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రామకుప్పం, శాంతిపురం, కుప్పం, గుడుపల్లె, కుప్పం మున్సిపల్ కొత్త అధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం, నంజప్ప, మునస్వామి, కృష్ణప్పగౌడు, నిజాంలు నియమితులయ్యారు. బుధవారం చిత్తూరులోని డీసీసీ కార్యాలయంలో కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల గోపి సమక్షంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి బాస్కర్, పార్టీ జిల్లా పరిశీలకులు రాంభూపాల్‌రెడ్డిలు వారికి నియామక పత్రాలు అందజేశారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే భూముల కబ్జా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రూ.కోట్లు విలువ చేసే భూమి కబ్జా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ బీజేపీ నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక రహదారుల మరియు భవనాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పుంగనూరు- మదనపల్లె మార్గంలోని రాగానిపల్లె రెవెన్యూ పరిధిలోని 230 సర్వేనంబర్‌లోని సుమారు 5 సెంట్లు భూమి రహదారుల మరియు భవనముల శాఖ భూమిగా ప్రభుత్వ రికార్డుల్లో ఉందన్నారు. ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారని, ఇప్పటికే కొంతభాగంలో భవనం నిర్మించారని పేర్కొన్నారు. కార్యకమంలో బీజేపీ నాయకులు రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు అయూబ్‌ఖాన్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్ ప్రవేశాలు

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమవుతాయని నందవనం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తులసీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి ద్వితీయ సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, రికార్డులు, బ్యాగులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

లద్దిగంలో వేగవంతంగా రీసర్వే పనులు



రీసర్వే పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ హనుమంతు

చౌడేపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): లద్దిగం పంచాయతీలో రీసర్వే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. బుధవారం ఆయన లద్దిగంలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, పట్టా, డీకేటీ తదితర భూములు 1,187.7 ఎకరాలు ఉన్నాయని, 4.8 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పంచాయతీ ఉందన్నారు. పంచాయతీలో 100 ఎకరాలు మాత్రమే సర్వే మిగిలిందని.. మరో 4 రోజుల్లో రీసర్వే పనులు పూర్తవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ గుణశేఖర్, వీఆర్‌వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

5న కెంపసముద్రంలో కబడ్డీ పోటీలు

రామకుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 5న రామకుప్పం మండలం కెంపసముద్రం గ్రామంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు జరిగే పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.15,116, రెండో బహుమతిగా రూ.10,116, మూడో బహుమతిగా రూ.7,116, నాలుగో బహుమతిగా రూ.4,116 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9393366664, 8688488618 ఫోన్‌నంబర్లను సంప్రదించాలని వారు కోరారు.

శ్రీరాముడికి పుష్పపల్లకీ సేవ

ఈనెల 6న శ్రీరామనవమి సందర్భంగా కెంపసముద్రం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు, మధ్యాహ్నం అన్నదానం, హరికథాలాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు శ్రీరాముల వారి పుష్పపల్లకీ సేవ నిర్వహిస్తారు.

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నాగరాజు దంపతులను సన్మానిస్తున్న ఎంఈవోలు

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని ఎంఈఓలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ చెందిన నాగరాజుకు బుధవారం సన్మాన సభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయులు లేని సమాజం ఊహించుకోలేమని తెలిపారు. అనంతరం పదవీ విరమణ చెందిన నాగరాజు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రాధాకృష్ణ, రచయిత రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ద్రౌపదీ ధర్మరాజుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఉభయదారులు

కల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో జరుగుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయం ప్రాంగణంలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాల్లో భాగంగా బుధవారం ద్రౌపదీదేవి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేపట్టారు. కల్యాణోత్సవం ఉభయదారులుగా పాళెం మాజీ సర్పంచ్ వెంకటరమణ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ నవీన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని వనమలదిన్నె, మేలుందొడ్డి పంచాయతీల పరిధిలో మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని రాగి తీగలను చోరీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఆగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న జడ్పీ సీఈవో రవినాయుడు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిమిట్ట గ్రామంలో నిర్మించిన ఆగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను జడ్పీ సీఈవో రవినాయుడు బుధవారం తనిఖీ చేశారు. రైతుల అవసరాల కోసం నిర్మించిన ఆగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌ను పరిశీలించి నాణ్యత, బిల్లు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద రైతుల కోసం నిర్మించిన సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో లీలామాధవి, కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మపురి గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ నివారణపై బుధవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్య విద్యాధికారి సావిత్రి అవగాహన కల్పించారు. ఎండలో వెళ్లినప్పుడు గొడుగు, టోపీ ఉపయోగించాలని, మజ్జిగ, నీరు, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యాధికారి విజయచందర్ ఆధ్వర్యంలో 104 సంచార వాహనం ద్వారా వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసి సాధారణ వ్యాధులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు రద్దు చేయండి



పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు



పుంగనూరులో నిరసన తెలుపుతున్న ఎస్‌డీపీఐ నాయకులు

పలమనేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో బుధవారం టవర్ క్లాక్ వద్ద పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన బీజేపీ నేడు ముస్లిం వ్యతిరేక పాలన సాగిస్తోందని ఆరోపించారు. సీఏఏ, ఎంఆర్‌సీ, వక్ఫ్ సవరణ బిల్లుతో దేశంలో విద్వేషం రెచ్చగొడుతోందని పేర్కొన్నారు. వెంటనే వక్ఫ్ బిల్లు ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

● పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలంటూ ఎస్‌డీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ప్లేకార్డులతో ధర్నా చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించకుంటే రానున్న కాలంలో టీడీపీ, జనసేన పార్టీలకు ముస్లింలు దూరంగా ఉంటారన్నారు. రాజ్యాంగ విరుద్దమైన బిల్లును వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి యూసఫ్, అన్వర్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి చైతన్య



విజేతలతో జనవిజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

పలమనేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి చైతన్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఓఎల్‌ఎల్ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక విద్యార్థులకు సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిర అభివృద్ధి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై సైన్సు ప్రయోగాలు చేసి వీడియోలు అప్‌లోడ్ చేసే పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని చేపట్టి వాతావరణంలో వచ్చే మార్పుల గురించి తెలుసుకోవాలన్నారు. భారత దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఓఎల్‌ఎల్ పాఠశాల విద్యార్థులు పర్యావరణ-సుస్థిర అభివృద్ధి అనే అంశంలో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం అనే అంశంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. చిన్నారులు నందకిషోర్, చరణ్‌సాయి, రీహాన్, భరత్‌కుమార్, అవినాష్, ఇంద్ర ప్రసాద్, వరుణ్, హరిష్‌లను అభినందించారు. ధ్రువపత్రాలు, సైన్సు పుస్తకాలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు గిరిధరమూర్తి, జిల్లా కోశాధికారి సుదర్శనాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యుగంధర్‌బాబు, ప్రధానోపాధ్యాయరాలు నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో పిల్లలకు ప్రత్యేక థెరపీ



సోమల పాఠశాలలో మాట్లాడుతున్న ఎంఈవో కేశవరెడ్డి

సోమల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో మానసిక ఎదుగుదల లేని పిల్లలకు ప్రత్యేక థెరపీతో నయం చేయొచ్చని ఎంఈవో కేశవరెడ్డి తెలిపారు. బుధవారం సోమల భవిత కార్యాలయంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు సెల్‌ఫోన్, యూట్యూబ్, వాట్సప్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎల్లయ్య, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు రవీంద్ర, రామ్మోహన్, ఇందిరాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీ నిర్మలకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో రకారకాల మానసిక రుగ్మతలు ఉంటాయని.. ఇందులో ఆటిజం ఓ మానసిక రుగ్మతని, నివారించడానికి భవితకేంద్రంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చైతన్యాచారి, సీఆర్పీ రామచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రొంపిచెర్ల: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడారు.



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసులు



బైరెడ్డిపల్లెలో..

కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోకనాధరెడ్డి, హేమలత, విజిత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కుప్పం డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

కుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కుప్పం ఆర్టీసీ డిపో ఎదుట ఎర్ర బ్యాడ్జీలతో నిరన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎ.వేలు, డిపో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మునస్వామి, ఈ.జయపాల్ మాట్లాడుతూ ఉద్యోగుల పనిభారం తగ్గించాలని, ఆరు నెలలకు ఒకసారి మెడికల్ చెకప్ చేయాలని, భద్రతా సర్క్యులర్ కచ్చితంగా అమలు చేయాలని, గ్యారేజ్ సిబ్బంది కొరతను సర్దుబాటు చేయాలని, విధులు ముగిసిన తర్వాత ఆన్ రూట్ టెస్ట్ పేరుతో 2 గంటలు కాలయాపన చేయడం మానుకోవాలని, లాంగ్ డిస్టెన్స్ అండ్ కంటిన్యూ డ్యూటీలకు రూ.150-రూ.400 వరకు అలవెన్స్ ఇవ్వాలని, గుర్తింపు పొందిన అసోసియేషన్‌తో నెలకోసారి జాయింట్ మీటింగ్ నిర్వహించాలని ఈ సందర్భంగా కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ డిపో చైర్మన్ బొట్టు మణి, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్ కుమార్, డిపో సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, సహాయ కార్యదర్శి ఏవీ.నారాయణ, గ్యారేజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, కార్యదర్శి జి.రహంతుల్లా, సంయుక్త కార్యదర్శి వి.జయశంకర్, ప్రచార కార్యదర్శి డి.అరుణ్, నాయకులు నారాయణ, జేవీ.రమణ, ఎల్లుస్వామి, ఎం.చంద్రానాయక్, టీఎస్.మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సేవలు ప్రశంసనీయం



మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆనందరెడ్డి

రామకుప్పం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ ప్రజలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డితెలిపారు. బుధవారం ఆలయం వద్ద కమిటీ ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ కమిటీ వేసవిని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలు సీతాపతి, ఆలయ పూజారి కృష్ణమూర్తి, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు పద్మమ్మ, టీడీపీ నేతలు బాలరాజు, సుబ్రహ్మణ్యం, ఆలయ మేనేజర్ రామచంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల హెచ్‌ఎంకు ఘనసన్మానం



ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఎంఈవో తదితరులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గౌహర్ సుల్తానాను బుధవారం ఎంఈవో వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఆమె చేసిన సేవలను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో సాయిలీల, సీఆర్పీ హెచ్‌ఎంలు, సీఆర్పీలు రామచంద్ర, షాబుద్దీన్, వెంకటరమణ, స్వర్ణలత, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి



పల్లవి (ఫైల్ ఫొటో)

వి.కోట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం పచ్చారమాకులపల్లె సమీపంలోని మామిడితోటలో చెట్టుకు వేలాడుతూ కుమ్మరమడుగుకు చెందిన రమేష్ కుమార్తె పల్లవి (17) అనుమానాస్పద స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన యువతి చెట్టుకు వేలాడుతుండగా.. కాళ్లు నేలకు తగులుతున్నాయి. దీంతో యువతి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. కర్ణాటకలోని రామసాగరంలో చదువుతున్న యువతి సెలవులకు అమ్మమ్మ ఊరికి వచ్చింది. ఫోన్ విషయమై ఇంట్లో యువతిని మందలించడంతో మంగళవారం ఉదయం నుంచి యువతి కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో చెట్టుకు యువతి ఉరి వేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా సీఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చింతచెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయ పడిన సంఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన లక్ష్మన్న కుమారుడు శంకరప్ప (50) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం కృష్ణమరెడ్డిపల్లె సమీపంలో చింతచెట్లలో కాయలు కోస్తుండగా కాలు జారి కింద పడ్డాడు. గుర్తింతోటి కూలీలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

కంపోస్టుయార్డుకు నిప్పు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపకాధికారులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగిరిగుంట పంచాయతీలోని అరవపల్లె సమీపంలో ఉన్న కంపోస్టుయార్డుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మున్సిపల్ కార్మికులు స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధానం

● ఎమ్మెల్యే మురళీమోహన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధానమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పూతలపట్టు నియోజకవర్గ ప్రజల నుంచి సుమారు 200 వినతులు అందాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అప్పటికప్పుడే పరిష్కరించదగిన కొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజాదర్బార్ కార్యక్రమం వల్ల ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం కలిగిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పూతలపట్టు, బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లె, ఐరాల మండలాల అధ్యక్షులు దొరబాబు, ఎన్పీ జయప్రకాష్, మురార్జీ యాదవ్, గాలి దిలీప్ కుమార్, గిరిధర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గురజాల ప్రజాదర్బార్‌కు 40 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఆర్ రాజన్ తదితరులు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రజాదర్బార్‌కు 40 వినతులు అందాయి. బుధవారం స్థానిక లక్ష్మీనగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో చిత్తూరు నియోజకవర్గ ప్రజల నుంచి టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, నగర కమిషనర్ నరసింహ ప్రసాద్, మేయర్ అముద వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో ముఖ్యంగా నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూసమస్యలు, పింఛన్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డీటీ నరేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలతో సీఆర్ రాజన్ సమావేశం నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపించాలి

- ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపించాలని మండల అధికారులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ ఆదేశించారు. బుధవారం కార్వేటినగరం వెలుగు కార్యాలయం వద్ద ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. అధికార బృందంతో కలసి థామస్ వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తీర్చాలని, ఇదే సమస్యలు మళ్లీ పునరావృతం కాకూడదన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం

కార్వేటినగరం పెద్దహరిజనవాడలో ఇటీవల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లుతో సహా సామగ్రి కాలిపోయిన బాధితులను బుధవారం థామస్ పరామర్శించారు. ఈ క్రమంలో రూ.10వేల సాయమందించారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు 'ఉచిత విద్యుత్‌ను ప్రకటించిన నేపథ్యంలో కొల్లాగుంటలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి చేనేత కార్మికులతో కలిసి ఆయన పాలాభిషేకం చేశారు. కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణను ఎమ్మెల్యే ప్రారంభించారు.

నరసింహ యాదవ్‌కు సన్మానం



చిత్తూరు సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రప్రదేశ్): ఆంధ్రప్రదేశ్ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన నరసింహ యాదవ్‌ను చిత్తూరు యాదవ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. బుధవారం విజయవాడ తుమ్మల కళాక్షేత్రంలో నిర్వహించిన నరసింహయాదవ్ ప్రమాణ స్వీకారానికి చిత్తూరుకు చెందిన యాదవ సంఘ నేతలు హాజరై ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, రాష్ట్ర పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, నేతలు హేమాద్రి యాదవ్, జ్యోతి యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, మునస్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధి బుద్ధి సమేత వినాయక కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చక్కెర ఫ్యాక్టరి సమీపంలోని సంపద వినాయక ఆలయ ప్రతిష్ఠాపన వార్షికోత్సవ పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి విశేష ద్రవ్య అభిషేకం, అలంకారం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధి బుద్ధి సమేత సంపద వినాయక స్వామికి ఉత్సవ నిర్వాహకులు కమనీయంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చక్కెర ఫ్యాక్టరీ ఎండీ జాన్‌విక్టర్ దంపతులు పాల్గొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎంఎల్ఎస్‌పీ గోదాము తనిఖీ

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులను డీలర్లకు సకాలంలో అందించాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని చిత్తూరు అర్బన్ తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి గోదాము అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న స్టాక్‌ను... గోదాములోని స్టాక్‌ను తనిఖీ చేశారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాలన్నారు.

దీర్ఘకాలిక సెలవుపై ఎంపీడీవో

పాలసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ఎంపీడీవోగా పనిచేస్తున్న కృష్ణమహేష్‌రెడ్డి దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లినట్లు తెలిసింది. దీంతో కార్వేటినగరం మండలంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న విద్యావతిని పాలసముద్రం ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జడ్పీ సీఈవో రవికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

భరించలేని ఎండ... తెరచాపలే అండ...!



పొన్నియమ్మగుడివీధిలో పచ్చని తెరలను ఏర్పాటు చేసుకున్న దుకాణదారులు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్ర జ్యోతి): కాంక్రీట్ కట్టడాలు, ఇరుకైన వీధులు, ఇంటింటికి మధ్య సందులేక పోవడం.. పచ్చని చెట్లులేక గాలి చొరబడక పోవడంతో వేసవికాలంలో భరించలేని ఉక్కపోతతో చిత్తూరు నగర ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం నానాతంటాలు పడుతున్నారు. చిత్తూరు నగరంలోని పొన్నియమ్మన్‌గుడి వీధి ప్రధాన వాణిజ్య కూడలిగా మారడంతో అక్కడి దుకాణదారులు ఎండల నుంచి బయటపడేందుకు ఇలాంటి పచ్చని తెరలు ఏర్పాటు చేసుకున్నారు. వీధిలో రాకపోకలు సాగించేవారుకొత్తగా చూసినా నగర వాసులకు తప్పదులే అన్నట్లు చర్చించుకోవడం కనిపిస్తోంది.

గుండె పోటుతో డప్పు కళాకారుడి మృతి



చిరంజీవి (ఫైల్ ఫొటో)

విజయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో డప్పు కళాకారుడు చిరంజీవి(55) బుధవారం మృతి చెందారు. విజయపురం మండలం కళియంబాకం ఆదిఆంధ్రవాడకు చెందిన చిరంజీవి ఆరుబయటకు వెళ్లి ఇంటికి చేరుకొన్నాక అలసటగా ఉందని చెబుతూ కుప్పకూలాడని గ్రామస్తులు తెలిపారు.

పడవేటమ్మ ఆలయంలో హుండీ చోరీ

విజయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లసముద్రంలో పడవేటమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి హుండీ చోరీకి గురైందని గ్రామస్తులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఏఎస్ఐ గోవిందరాజు, సిబ్బంది పరిశీలించారు. ఈ విషయమై పలువురిని విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి





మృతి చెందిన చంద్రమోహన్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో ఫైల్ ఫొటో)

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని ఇరువారం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కథనం మేరకు... యాదమరి మండలం మాదిరెడ్డిపల్లెకు చెందిన జ్యోతి రెడ్డి కుమారుడు చంద్రమోహన్‌రెడ్డి (43) టెంకాయల వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం నగరంలో టెంకాయలను అన్‌లోడ్ చేసి తిరిగి బైపాస్‌రోడ్డులో ఇంటికి వెళుతుండగా... ఇరువారం సమీపంలో ట్రాక్టర్‌ను వెనుకవైపు వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నుంచి ట్రాలీ విడిపోగా, ఇంజన్ రెండు పల్టీలు కొట్టింది. దీంతో చంద్రమోహన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబంలో చంద్రమోహన్‌రెడ్డి ఏకైక కుమారుడు కావడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

బియ్యం గోడౌన్ తనిఖీ

పూతలపట్టు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వున్న మండల్ లెవల్ స్టాక్ పాయింట్‌ను బుధవారం తహసీల్దార్ రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో వున్న స్టాకును, సంబంధిత రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీటీ పూజిత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

గుడిపాల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కుమార్‌ను బుధవారం మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో శివరాజ్ పదవీ విరమణ పొందడంతో ఆ స్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కుమార్ పదోన్నతిపై ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో మొగరాలపల్లి మాజీ సర్పంచ్ హరి నాయుడు, టీడీపీ నాయకులు భీమ, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సివిల్ సర్వీస్ ఖో-ఖో పోటీలు గత నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఢిల్లీలో జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ముగ్గురు క్రీడా ఉపాధ్యాయులకు కాంస్య పతకాలు లభించాయి. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ యాదమరి మండలం జడ్పీ హైస్కూల్ కొటాలం పీఈటీ సురేష్‌కుమార్, కుప్పం మండలం మిట్టపల్లె జడ్పీ హైస్కూల్ పీడీ ముత్తు, బైరెడ్డిపల్లె మండలం తీర్థం జడ్పీ హైస్కూల్ పీడీ దేవేంద్రలను అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్నీ పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. వీరితో పాటు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేక అదృశ్యం



నరహరి(ఫైల్ ఫొటో)

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన నగర పరిధిలోని చెన్నమ్మగుడిపల్లెలో జరిగింది. నగరంలోని చెన్నమ్మగుడిపల్లెకు చెందిన జ్యోతికి మదనపల్లి సమీపంలోని అంకిశెట్టిపల్లికి చెందిన నరహరితో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నాడు. బాధితురాలు జ్యోతి కథనం మేరకు.... తన భర్త నరహరి తాగుడుకు బానిస కావడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండటంతో విరూపాక్షపురంలో నాటు వైద్యం చేయిస్తున్నట్లు తెలిపింది. మార్చి 26వ తేదీన చెన్నమ్మగుడిపల్లెలోని తన తల్లిగారింట్లో ఉండగా, అర్ధరాత్రి సమయంలో నరహరి అదృశ్యమయ్యాడని చెప్పింది. ఈ మేరకు చిత్తూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. తన భర్త ఆచూకీ తెలిసిన వారు 8143651223 లేదా 9441080821 ఫోన్ నెంబర్లకు తెలియజేయాలని ఆమె కోరారు.

కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దు

● ప్రభుత్వ విప్ థామస్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, నాయకులు అధైర్యపడొద్దని, ఏదైనా సమస్య ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే థామస్ అన్నారు. బుధవారం కార్వేటినగరంలో 'కార్యకర్తే అధినేత' సమావేశం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా థామస్ మాట్లాడుతూ సొంత గొడవలకు పార్టీ రంగులు పులిమి ఇబ్బందులు చేయవద్దని హితవు పలికారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే న్యాయం చేస్తామని చెప్పారు. ఓ వ్యక్తి చావుల వద్దకు వెళ్లి పూలమాల వేసి సీనియర్ నాయకుడిని అంటూ తిరుగుతున్నాడు.. అలాంటి వాళ్లు సీనియర్ నాయకులు కాదని.. యోనా, రాజా వంటి వారు సీనియర్ నాయకులని అందరికీ పరిచయం చేశారు. తాను అందుబాటులో లేనిపక్షంలో పార్టీ మండల అధ్యక్షుడు, తాను చెప్పిన సీనియర్ నాయకులు వచ్చి సమస్యలను పరిష్కరిష్కరిస్తారన్నారు. ఈ నేపథ్యంలో ఓ నాయకుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే లెటర్లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని, దీంతో చెడ్డపేరు వస్తోందని, ఆచీతూచీ అవసరమైన వారికే ఇవ్వాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, నాయకులు మాదిరాజు జనార్థన్‌రాజు, నాగేశ్వరరాజు, చంద్రగిరి చెంగల్రాయులు, తోటి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వెనుకబడితే చర్యలు: కలెక్టర్

యాదమరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అర్జీలు సకాలంలో పరిష్కరించకపోతే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాల నమోదుకు సిబ్బంది నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే తహసీల్దార్ కార్యాలయంలో వారంలో ఒకరోజు రెవెన్యూ కోర్టు నిర్వహించి, ఇరువైపులా ఫిర్యాదుదారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. జూన్ నెలలోగా వందశాతం రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో వేణు, ఏపీవో సంధ్యారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉషారాణి, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ తులసీధర్, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



స్వామి వారి గ్రామోత్సవం

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరాలయంలో జరుగుతున్న పంగుణి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అష్ట దిక్పాలికులకు, ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ వేద పండితుల మంత్రోచ్చరణలతో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారికి పంచమూర్తి ఉత్సవాన్ని ఈవో వెంకట్రాయులు, అర్చకులు శివకుమార్ శివాచార్యులు, కాళభైరవట్రస్టు నిర్వాహకులు టి.వెంకటేషన్ దంపతులు, స్వర్ణకారుల సంఘం నాయకులు మల్లికార్జున దంపతుల ఉభయంతో నిర్వహించి, పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. చిత్తూరు కరుణీకర్ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్లకు హంస వాహన సేవతో పురవాసులకు, భక్తులకు దర్శనం కల్పించారు. కరుణీకర్ అభ్యుదయ సంఘం ప్రతినిధులు కె.నిత్యానందం, కె.విద్యుమణి, కె.సూర్యమూర్తి, కె.తులసి, రామలింగం, రవిచంద్రన్, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి స్పోర్ట్స్ కిట్ వితరణ



స్పోర్ట్స్ కిట్‌ను వితరణ చేస్తున్న రీడ్స్ సంస్థ నిర్వాహకులు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటిజంపై అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం చిత్తూరు భవిత కేంద్రానికి రీడ్స్ సంస్థ స్పోర్ట్స్ కిట్‌ను వితరణ చేసింది. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తల్లి రజిని చేతుల మీదుగా భవిత కేంద్రంలోని పిల్లలకు ఈ కిట్‌ను అందించారు. అనంతరం ఇటీవల రాష్ట్ర పారా అథ్లెటిక్స్‌లో ఉత్తమ కనబరిచిన గణేష్‌ను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో-1, 2 సెల్వరాజ్, మోహన్, రీడ్స్ సంస్థ ప్రతినిధులు కోదండపాణి, భవిత ఉపాధ్యాయిని హేమలత, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటిజం లక్షణాలను సకాలంలో గుర్తిస్తే తగ్గించొచ్చు

శ్రీరంగరాజపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆటిజం లక్షణాలను సకాలంలో గుర్తిస్తే తగ్గించొచ్చని ప్రధానోపాధ్యాయులు మోహన్ అన్నారు. ప్రపంచ ఆటిజంపై అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం ఎస్ఆర్‌పురం భవిత కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటిజంతో పుట్టిన పిల్లలు ఒంటరిగా ఉండటానికి ఇష్టపడతారని, వీరు అందరితో కలిసేలా కృషి చేయాలని చెప్పారు. ఆటిజం ఉన్న పిల్లలకు ప్రతిరోజూ ఫిజియోథెరపీ చేస్తే కొంత మెరుగుపడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీ ఉపాధ్యాయులు అరుణ, ఉపాధ్యాయుడు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌తో విద్యార్థినులు, మహిళలకు రక్షణ



మాట్లాడుతున్న డీఎస్పీ విజయకుమార్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పోలీస్‌శాఖచే రూపొందించిన శక్తియాప్‌తో విద్యార్థినులు, మహిళలకు రక్షణ లభిస్తుందని చిత్తూరు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ విజయకుమార్ అన్నారు. గంగాధరనెల్లూరు హైస్కూల్లో విద్యార్థినులకు శక్తియాప్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ వివిధ గ్రామాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లల్లో, కాలేజీల్లో విద్యార్థినులు, యువతులు, మహిళలకు శక్తియాప్ గురించి ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించి, దాని వల్ల కలిగే లాభాలపై చైతన్యవంతం చేస్తామన్నారు. ఎక్కడైనా ఆకతాయిల వేధింపులు ఉన్నట్లయితే శక్తియాప్‌ను వినియోగిస్తే వెంటనే పోలీసుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగసౌజన్య, హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం దినకర్, టీచర్లు మురళి, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ సెంటర్ తనిఖీ



విజయపురంలో వ్యాక్సినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఐవో హనుమంతరావు

విజయపురం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోసలనగరం ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం జిల్లా వ్యాక్సినేషన్ అధికారి(డీఐవో) హనుమంతరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజయపురంలో వ్యాక్సినేషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పుడుతుందని స్కాన్ చేసి అబార్షన్‌కు పాల్పడితే కేసులు తప్పవని హెచ్చరించారు. అబార్షన్ కేసులను పూర్తి స్థాయిలో సూపర్‌వైజర్లు పరిశీలించాలని కోరారు. వ్యాక్సినేషన్‌లో కోల్డ్‌చైన్‌ను తప్పనిసరిగా పాటించాలని కోరారు. పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో కంప్యూటరు, కరెంటు సదుపాయం ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి విష్ణుప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలో అడ్డుగా ఉన్న స్తంభాన్ని తొలగించండి

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తాము లేని సమయంలో పొలానికి వెళ్లే దారిలో నాటిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని గుడిపాల మండలానికి చెందిన రైతు విద్యుత్ శాఖ ప్రత్యేక గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదు చేశారు. బుధవారం స్థానిక గాంధీ రోడ్డులోని విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్‌డే నిర్వహించారు. వినియోగదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఓబనపల్లి, కొంగారెడ్డిపల్లిలో తొలగించిన సర్వీసును పునరుద్ధరించాలని అర్జీ సమర్పించారు. మొత్తం నాలుగు ఫిర్యాదులు వచ్చాయని టెక్నికల్ ఏఈ మాధురి తెలిపారు.

తాగునీటిని ల్యాబ్‌కు పంపించండి

● కమిషనర్‌కు విన్నపం



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నగరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాకు వచ్చే తాగునీరు తాగడానికి పనికి వస్తుందా? లేదో ల్యాబ్‌లో పరీక్షించి చెప్పాలంటూ రసాయనిక రంగునీటి వ్యతిరేక ఉద్యమ అధ్యక్షులు గజేంద్రన్ మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి బుధవారం వినతిపత్రం అందించారు. అఖిలపక్ష నేతలతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రాన్ని, నీటిని అందించారు. ఆయన మాట్లాడుతూ భూగర్భజలాలు కలుషితమై సోరియాసిస్, కిడ్నీలు పాడవడం లాంటి వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో లభ్యమయ్యే నీరు తాగడానికి, వంట చేయడానికి, స్నానానికి పనికివస్తాయో లేదా చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షనేతలు బీడీ భాస్కర్, బాబు తదితరులు పాల్గొన్నారు

30 వరకు ర్యాలీలు, బహిరంగ సభల నిషేధం

నగరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరి సబ్‌డివిజన్ పరిధిలో ఏప్రిల్ 30వ తేదీ వరకు పోలీస్ యాక్టు 30, 30(ఏ)అమలులో ఉంటుందని డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలు చేయడం, రోడ్లపై గుమికూడి ఉండటం, బహిరంగ సమావేశాలు నిర్వహించడం నిషేధమని చెప్పారు.

నేటి నుంచి కరకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నగరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి పంగుణోత్తర తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం సూర్యప్రభ వాహనసేవ నిర్వహిస్తారు. ఏప్రిల్ 4న చంద్రప్రభ వాహనం, 5న అధికార నంది వాహనం, 6న శేష వాహనం, 7న వృషభ వాహనం, 8న గజ వాహనం, 9న రథోత్రవం, 10న కల్యాణోత్సవం, 11న రావణేశ్వర వాహనసేవ, ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి



ర్యాలీగా వస్తున్న క్రైస్తవులు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి వద్ద మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని చిత్తూరు జిల్లా పాస్టర్స్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ బుధవారం యూనియన్ ఆధ్వర్యంలో పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షులు రాబిన్‌కుమార్ మాట్లాడుతూ ప్రవీణ్ మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కలెక్టరేట్ అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. సంఘనేతలు కుమార్, రవి, లాజర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని వెంటనే ఖాళీచేయాలి

పాలసముద్రం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోదండరామాపురంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని వెంటనే ఖాళీచేయాలని సంబంధిత వ్యక్తిని తహసీల్దార్ అరుణకుమారి హెచ్చరించారు. మండలంలోని నరసింహాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఓ ఇంటిని నిర్మించుకున్నాడు. ఈ విషయాన్ని కోదండరామాపురం గ్రామస్థులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించకపోవడంతో, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ బుధవారం రెవెన్యూసిబ్బందితో వెళ్లి ప్రభుత్వ భూమిలో ఆక్రమించుకుని నిర్మించిన ఇంటిని వెంటనే తొలగించాలని ఆక్రమణదారుడికి నోటీసులు జారీచేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు రమేష్ నాయుడు, శ్రీనివాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వృద్ధుడికి గాయాలు



గాయపడిన ఏకాంబరం

వెదురుకుప్పం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధుడు గాయపడిన ఘటన బుధవారం వెదురుకుప్పం మండలంలో జరిగింది. ఈ ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెదురుకుప్పం మండలం దేవళంపేటలో ఇటుకలతో వెళ్తున్న ట్రాక్టరు నుంచి జారిపడి ఎస్ఆర్‌పురం మండలం సీకేపురం గ్రామానికి చెందిన ఏకాంబరం(65) గాయపడినట్లు తెలిపారు. ట్రాక్టరు టైరు తీస్తుండగా గాయపడ్డాడని చెప్పారు. ఏం జరిగిందో తెలియాలంటే పోలీసుల విచారణలో వెల్లడి కావాల్సి ఉంది.

వివాహిత అదృశ్యం



జీనత్ (ఫైల్‌ఫొటో)

తవణంపల్లె, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలు... మండలంలోని అరగొండకు చెందిన అల్లాబాషా భార్య జీనత్(55) గత కొంత కాలంగా మతిస్థిమితం లేకపోవడంతో వేలూరు బాగాయంలో చికిత్స పొందుతూ రంజాన్ పండుగకు స్వగ్రామానికి వచ్చింది. పండుగ సందర్భంగా ఇంటిని అల్లాబాషా శుభ్రం చేస్తుండగా దుకాణానికి వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. అప్పటి నుంచి పరిసర గ్రామాల్లో, బంధువుల వద్ద వెతికినా కనపడలేదు. దీంతో అల్లా బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.